# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 284
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
ఆగస్టు 19, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## 1,000 కోట్లతో చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు

# జీ.. కేర్ ఫుల్

వివరాలు2లో..





## ఉత్సవాలు విషాదం కాకూడదు

- భారీ విగ్రహాలతో జర భద్రం
- విద్యుత్ వైర్లతో పొంచి ఉన్న ప్రమాదం
- బండ్లగూడ ఘటనలో ఇద్దరు యువకుల మృతి

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా రామంతాపూర్ లో జరిగిన విషాదం మరువకముందే బండ్లగూడలో మరో విషాద ఘటన అందరినీ కలచివేస్తోంది. కొందరు యువకులు భారీ వినాయక విగ్రహాన్ని తరలిస్తుండగా హై టెన్షన్ విద్యుత్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ట్రాక్టర్ నడుపుతున్న యువకుడితోపాటు అతని వెనుక కూర్చున్న మిత్రుడు అక్కడికక్కడే మృతి చెందారు. హైదరాబాద్ లోనే జరిగిన మరో గణేష్ ఉత్సవ ఘటనలో మరో యువకుడు మృత్యువాత పడ్డారు. కేవలం మూడు రోజుల్లో జరిగిన మూడు సంఘటనల్లో ఎనిమిది మంది మృతి చెందారు. దీంతో ఉత్సవాలు విషాదం కాకూడదంటూ సామాజిక కార్యకర్తలు పిలుపునిస్తున్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయక ఉత్సవాలను నిర్వహించేందుకు ఊరు.. వాడ ఒక్కటవుతున్న వేళ ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోందంటున్నారు. వినాయక మండపాలకు భారీ విగ్రహాలు తరలించే క్రమంలో కేర్ ఫుల్ గా ఉండాలంటున్నారు. అదే విధంగా నిమజ్జనం చేసే సమయంలోనూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

2లో..



## సాండ్ బజార్‌లో తక్కువ ధరకే ఇసుక

- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రయోజనం
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



8లో..

## సంక్షేమమే సేవ.. సైన్సే లక్ష్యం

- అట్టహాసంగా తెలంగాణ సైన్సు కాంగ్రెస్ ప్రారంభం
- కేయూలో మూడు రోజుల పాటు నిర్వహణ



8లో..

## ఒక్క ఫొటో వెయ్యి భావాలకు సమానం

- జర్నలిస్టుల సంక్షేమానికి కృషి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు

# జీ.. కేర్ ఫుల్

- ఉత్సవాలు విషాదం కాకూడదు
- భారీ విగ్రహాలతో జర భద్రం
- విద్యుత్ వైర్లతో పొంచి ఉన్న ప్రమాదం
- బండ్లగూడ ఘటనలో ఇద్దరు యువకుల మృతి



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** హైదరాబాద్ లోని పాతబస్తీ బండ్లగూడలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. భారీ గణేష్ విగ్రహాన్ని తరలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన అఖిల్ ను ఆస్పత్రికి తరలించారు. అయితే మృతి చెందిన వారు టోని (21), వికాస్ (20) గా గుర్తించారు. విద్యుత్ తీగలను కర్రతో పైకి లేపుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. కరెంట్ షాక్ తో ట్రాక్టర్ టైర్లు పూర్తిగా కాలిపోయాయి. అదేవిధంగా అంబర్ పేటలో యువకుడు రామ్ చరణ్ అడ్డు వచ్చిన విద్యుత్ తీగలను తొలగిస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు.

## సహాయక చర్యలు..

బండ్లగూడ ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. రాత్రి 11 గంటలకు కొందరు యువకులు గణేష్ విగ్రహాన్ని తీసుకొచ్చేందుకు చాంద్రాయణ గుట్ట నుంచి జలపల్లి వెళ్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అక్కడ భారీ గణేష్ విగ్రహం తీసుకొని పురానాపూల్ బయలుదేరారు. రాత్రి 12 గంటల తర్వాత చాంద్రాయణగుట్ట–బండ్లగూడ రోడ్డు రాగానే కర్రతో విద్యుత్ తీగలను పైకి లేపుతున్న క్రమంలో విద్యుదాఘాతం జరిగింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న టోనీ కిందపడిపోగా ఆయనపైనుంచి ట్రాక్టర్ దూసుకెళ్లింది. టోనీతోపాటు ట్రాక్టర్ పై కూర్చున్న అతని మిత్రుడు వికాస్ కూడా ట్రాక్టర్ పైనుంచి కిందపడి మృతి చెందాడు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా గాయపడిన వారిని స్థానిక ఓవైసీ ఆస్పత్రికి తీసుకెల్లారు. విద్యుదాఘాతంతో ట్రాక్టర్ టైర్లు పూర్తిగా కాళిపోవడంతో క్రేన్ సహాయంతో వినాయక విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో..

రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా రథంపై శ్రీకృష్ణుడి ఉరేగింపు కోసం ప్రత్యేక రథాన్ని తయారు చేశారు. ఆదివారం రాత్రి స్థానిక యాదవ సంఘం భవనం నుంచి శ్రీకృష్ణుడి ఉరేగింపు చేపట్టారు. ఓవైపు వర్షం పడుతుండగా మరోవైపు భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి రథయాత్ర ముందుకు సాగింది. ఉరేగింపు దాదాపు పూర్తయి తిరిగి రథాన్ని యాదవ సంఘ భవనం వద్ద పెట్టేందుకు వెళ్తుండగా రథాన్ని ముందుకు లాగుతున్న జీపు ఆగిపోయింది. వంద అడుగుల దూరంలోనే గమ్యం ఉండటంతో పలువురు చేతులతో తోస్తూ వెళ్లారు. మరో 50 అడుగుల దూరం ఉండగానే ఆకస్మాత్తుగా రథాన్ని లాగుతున్న వాళ్లు గట్టిగా అరుస్తూ కిందపడిపోయారు. అప్పటికే రథంపై ఉన్న వాళ్లు ఏం జరిగిందో అర్థం కాక పరుగులు పెట్టారు. వేలాడుతున్న కేబుత్ తీగతో రథానికి విద్యుదాఘాతమైంది. దీంతో వెనుక నుంచి తోస్తున్న వాళ్లు తొమ్మిది మంది అపస్మార స్థితిలో పడిపోయారు. వారిని రక్షించేందుకు స్థానికులు కొందరు వారికి సీపీఆర్ కూడా చేసినా ఫలితం లేకుండాపోయింది. ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలోదిలారు. మరో నలుగురిని చికిత్స కోసం వివిధ ఆస్పత్రులకు తరలించారు.

## విషాదం కాకూడదు..

అయితే అత్యంత భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు నిర్వహించుకునే గణేష్ ఉత్సవాల్లో విషాదానికి తావు లేకుండా ఉత్సవ కమిటీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు పిలుపునిస్తున్నారు. ప్రతి ఒక్కరు భారీ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకే మక్కువ చూపుతున్న తరుణంలో కేర్ ఫుల్ గా ఉండాల్సిన అవసరం ఉందంటున్నారు. మండపాలవద్ద అగ్ని ప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. పోలీసుల నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ ఉత్సవాలను జయప్రదం చేసుకోవాలంటున్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలోకూడా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలంటున్నారు.





# ఘనంగా మంత్రి సురేఖ జన్మదిన వేడుకలు

- భారీ కేక్ కట్ చేసిన కార్యకర్తలు
- 800 కుటుంబాలకు నిత్యావసరాల అందజేత

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ జన్మదిన వేడుకలను మంగళవారం నగరంలోన ఘనంగా నిర్వహించారు. మహేశ్వరి గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఇటీవల వరదలతో సర్వం కోల్పోయిన 800 కుటుంబాలకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్ మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ జన్మదినాన్ని అట్టహాసంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. నిరుపేదలకు బియ్యంతోపాటు 11 రకాల నిత్యావసర సరుకులను అందజేసినట్లు వెల్లడించారు. అనంతరం తూర్పు నియోజకవర్గంలోని ఆటోనగర్ అందుల పాఠశాలలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి మహా అన్నదానం నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. అలాగే మదర్ తెరిసా ఆశ్రమంలో మానసిక వికలాంగులతో కేక్ కట్ చేయించి మహా అన్నదానం చేసినట్లు నవీన్ రాజ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, 28వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కురిమిల్ల సంపత్, మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు మబ్బు ప్రవీణ్, కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, ముష్కమల్ల అరుణ–సుధాకర్, పల్లం పద్మ–రవి, భోగి సువర్ణ–సురేష్, కావేటి కవిత, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, వాస్కుల బాబు, బాల్య సురేష్, సురేష్ జోషి, ఓని స్వర్ణలత భాస్కర్, గుండు చందన పూర్ణచందర్, భద్రకాళి ధర్మకర్త తొగరు క్రాంతి, మాజీ కార్పొరేటర్లు కేడల పద్మ జనార్ధన్, ఎండి యాకూబ్ పాషా, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కొండ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి అందుకున్న రమేష్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో కుడుతాల రమేష్ కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ బహుమతిని మంగళవారం హైదరాబాద్ లోని గ్రీన్ ల్యాండ్స్ హోటల్ లో రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సమాచార, పౌర సంబంధాల కమిషనర్ సీహెచ్ ప్రియాంక, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సీఎం సీపీఆర్ఓ మల్సూర్ చేతుల మీదుగా కుడుతల రమేష్ అవార్డును అందుకున్నారు.

# సాండ్ బజార్ లో తక్కువ ధరకే ఇసుక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండీసీ ఆధ్వర్యంలో సాండ్ బజార్ ను ఏర్పాటు చేసిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండీసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాండ్ బజార్ ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, టీజీఎండీసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సాండ్ బజార్ లో నాణ్యమైన ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సాండ్ బజార్ లో అందుబాటులో ఉన్న నాణ్యమైన ఇసుకను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీజీఎండీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాండ్ బజార్ లో వినియోగదారులకు సరిపడే విధంగా ఇసుక నిల్వలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఇసుక కోసం వచ్చే లబ్ధిదారులకు సిబ్బంది ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. సాండ్ బజార్ లో లభించే ఇసుకను తీసుకోవడానికి ఆన్ లైన్ లో బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆన్ లైన్ లో బుక్ చేసుకోవడం రాని వారికి సిబ్బందే ఆన్ లైన్ లో ఇసుక బుకింగ్ చేసి అందించాలన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నందున ఆయా గ్రామాలలో ఇసుక అవసరాలను గుర్తించి ఆయా గ్రామాల వద్దకే ఇసుకను తీసుకెళ్లడానికి ఉన్న మార్గాలను వెతకాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఎంతో సహకారం అందిస్తుందన్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో 80 శాతం ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ అయిందని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఇది అత్యధికమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు తక్కువ ధరలో లబ్ధిదారులకు ఇసుక అందించడమే లక్ష్యంగా సాండ్ బజార్ ను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ రేట్ లో సాండ్ బజార్ లో ఇసుక లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాణ్యమైన ఇసుకను అందించే సాండ్ బజార్ ఏర్పాటుతో పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఉనికిచర్ల వద్ద రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్లో నాణ్యమైన ఇసుక తక్కువ ధరలో అందుబాటులో ఉంటుందని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీఎండీసీ నోడల్ అధికారి శ్రీనివాస్, పీడీ హౌసింగ్ సిద్ధార్థ నాయక్, హనుమకొండ, కరీంనగర్, పెద్దపల్లి ప్రాజెక్ట్ అధికారులు విష్ణువర్ధన్, వినయ్, రాజు, స్థానిక తహసిల్దార్ సదానందం, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# సీపీఎస్‌ను రద్దు చేయాలి

◆ పీఆర్టీయూ మహాధర్నా గోడపత్రిక ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, నడికూడ :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన పీఆర్టీయూ టీఎస్ మహాధర్నా గోడపత్రికను నడికూడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని పీఆర్టీయూ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి మాట్లాడుతూ, గత ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలించి కూడా సీపీఎస్‌ను రద్దు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానం 2004 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిందని, ఆ రోజును తాము విద్రోహ దినంగా పాటిస్తున్నామని చెప్పారు. 30 ఏళ్లు ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగులకు పెన్షన్ హక్కు లేకపోవడం అన్యాయమని, ప్రజాప్రతినిధులకు మాత్రం పెన్షన్ హక్కు ఉండడం విచారకరమన్నారు. ఉద్యోగులు షేర్ మార్కెట్లపై ఆధారపడిన అసంబద్ధమైన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని శ్రీహరి కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఏకీకృత పెన్షన్ సిస్టమ్ (యూపీఎస్) కూడా లోపభూయిష్టంగా ఉందని, పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి తీసుకువచ్చే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1న జరగబోయే మహాధర్నాలో ఉపాధ్యాయులందరూ సెలవు పెట్టి, నల్ల దుస్తులతో పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాధర్నాకు టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి, ఏఐఎఫ్టీవో జనరల్ సెక్రెటరీ సీఎల్ రోస్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో పీఆర్టీయూ నడికూడ మండల శాఖ ప్రధాన కార్యదర్శి కటుకోజ్వల సతీష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గొట్టేముక్కుల శ్రీనివాస్ రెడ్డి, మోడం రాజేందర్ బాబు, నన్నేసాహెబ్, బూరుగు శంకర్, బాలాజీ, శరత్ గౌడ్, విశ్వేశ్వర్, ప్రేమానందం, శివకుమార్, నగేష్, నరసింహారెడ్డి, రవీందర్, జగదీశ్వర్, ప్రకాష్ రావు, రజనీకాంత్, శ్రావణ్ కుమార్, రాజన్న, స్నేహ, శ్రీదేవి, జ్యోత్స్న, సునీత, శ్రీనివాస్, సాంబరాజు, రాజకుమార్, రాజు నాయక్, కృష్ణ, రాజేష్, జయేందర్, రాంబాబు, నాగరాజు, లావణ్య, జయ, శారద, సుమలత, ఉదయ్ కుమార్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సంక్షేమానికి ఐకమత్యంతో కృషి చేయాలి



■ గంగు ఉపేంద్ర శర్మ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం హనుమకొండలోని చింతగట్టులో ఉన్న డీఎస్ఆర్ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఐకమత్యంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మోత్కూరి రామేశ్వరరావును, చైర్మన్‌గా ఎన్నికైన వెన్నంపల్లి జగన్మోహన్ శర్మను, కోశాధికారి విజయ సారధి ఆచార్యులను గంగు ఉపేంద్ర శర్మ అభినందించారు. ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబులను కలిసి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గోపనపల్లిలో బ్రాహ్మణ సదనం కోసం రూ. 10 కోట్లు, 6 ఎకరాల స్థలం కేటాయిస్తూ జీవో విడుదల చేయబడిందని గుర్తు చేశారు. అదేవిధంగా, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ధూపదీప నైవేద్య అర్చకుల వేతనం రూ. 2,500 నుండి రూ. 6,000కు, ఆ తర్వాత రూ. 10,000కు పెంచడంలో వరంగల్ జిల్లా పోరాటం ప్రధాన పాత్ర పోషించిందని చెప్పారు. ఇటీవల కొండా సురేఖ దేవాలయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ జీవోను అమలుపరిచినందుకు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బ్రాహ్మణుల సమస్యలపై వరంగల్ జిల్లా ఎల్లప్పుడూ ముందుండి పోరాడిందని ఉపేంద్ర శర్మ అన్నారు. గతంలో కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్న దుద్దిల్ల శ్రీధర్ బాబుకు అన్యాయం జరిగినప్పుడు, వరంగల్ నుంచే పోరు ప్రారంభమైందని గుర్తు చేశారు. అలాగే, మోహన్ బాబు నటించిన 'దేనికైనా రెడీ' సినిమాలో బ్రాహ్మణులను కించపరిచేలా చిత్రీకరించినప్పుడు, దానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసింది కూడా వరంగల్ జిల్లాలోనే అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దర్శనం శర్మ (వెంకటరమణ శర్మ), గిరి ప్రసాద్ శర్మ, వివిధ జిల్లాల నుంచి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సభ్యులు, బ్రాహ్మణ పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



**వరంగల్ వాయిస్, ములుగు :** రామప్ప ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై ఉన్న బాలాజీ నిరంజన్ ఫొటో స్టూడియో వద్ద ప్రపంచ ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. డాగూరే చిత్రపటంతో ఫొటోగ్రాఫర్స్ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "ఫొటోగ్రాఫర్ల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రామప్ప ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కందుల రవీందర్, జక్కుల సదానందం ప్రసంగించారు. 1839 ఆగస్టు 19న ఫ్రెంచ్ ప్రభుత్వం మొదటి ప్రాక్టికల్ ఫొటోగ్రఫీ ప్రక్రియ అయిన 'డగేరియా టైప్'ను ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తెచ్చిందని వారు గుర్తుచేశారు. ఈ ప్రక్రియ ద్వారా లోహపు పలకపై స్పష్టమైన, శాశ్వత చిత్రాలను తీయవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియను అభివృద్ధి చేసి ఫొటోగ్రఫీని ఒక కళారూపంగా మార్చిన లూయిస్ డాగూరేకు కృతజ్ఞతలు తెలిపారు. అప్పటి నుండి ఆగస్టు 19ని ఫొటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. నిరుద్యోగ యువత జీవనోపాధి కోసం ఫొటోగ్రఫీ రంగాన్ని ఎంచుకుంటున్నారని, రోజురోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నందున ఫొటోగ్రాఫర్స్ అందుకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని వారు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫొటోగ్రాఫర్లకు ఆరోగ్య బీమాతో పాటు కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందించేలా జీవోలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జీవిత భద్రత లేని ఈ రంగంలో ఎందరో ఉపాధి పొందుతున్నారని, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గాదం దేవేందర్, యుగంధర్, కుసుమ రాజు, శ్రీనివాస్, నవీన్, సతీష్, ముకులోత్ శరత్, బోనాల వినీత్ చారి, చిదర్ల సాయి, ఆజ్మీర సునిల్, విజేయ్, తదితర ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# పెంటయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన మంగళపల్లి పెంటయ్య కుటుంబానికి పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెదగాని సోమన్న ఆర్థిక సహాయం అందజేశారు. పెదగాని సోమన్న దివంగత పెంటయ్య కుమారుడు మంగళపల్లి సురేష్‌కు 50 కిలోల బియ్యంతో పాటు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంగళపల్లి స్వామి, అర్వపల్లి ఆశయ్య, సోమయ్య, ఉప్పలయ్య, యాకయ్య, బిక్షపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సన్నాలకు 'బోనస్' ఉట్టి ముచ్చటేనా.!

## విమర్శించిన రైతు రక్షణ సమితి అధ్యక్షుడు



**వరంగల్ వాయిస్, నడికూడ :** సన్నాలకు బోనస్ ఇవ్వడం కేవలం మాటలకే పరిమితమైందని రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు విమర్శించారు. సన్నాలకు బోనస్ డబ్బులు వారం రోజుల్లో చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని మూడు నెలలు గడిచినా నిలబెట్టుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని కిషన్ రావు డిమాండ్ చేశారు. రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వెంటనే బోనస్ డబ్బులు చెల్లించాలని కోరారు. తమది రైతు ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఆచరణలో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో ప్రజలు, రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఆరుగాలం శ్రమించి పంట పండించే అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలవాలని కిషన్ రావు స్పష్టం చేశారు. రైతులకు లాభం చేకూర్చాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే వెంటనే తగు చర్యలు చేపట్టాలని కోరారు.

# విజయ్‌కుమార్‌కు పీహెచ్‌డీ పట్టా



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** పేదరికం, కష్టాలను అధిగమించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన డా.టి. విజయ్‌కుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఘనమైన కన్వొకేషన్ సభలో తన పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. జనగాం జిల్లా, రఘునాథపల్లి మండలం, కుర్చపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మికులైన తోకల వెంకటయ్య, సరోజనల కుమారుడు విజయ్‌కుమార్‌కు ఇది కేవలం డిగ్రీ మాత్రమే కాదు, ఆయన పట్టుదలకు, కఠోర శ్రమకు నిదర్శనం.బాల్యం నుంచే ఆర్థిక సమస్యలు, సామాజిక వివక్షను ఎదుర్కొన్న విజయ్‌కుమార్, చదువు కోసం ప్రతిరోజు ఆరు కిలోమీటర్లు నడిచేవారు. అయినా సరే, విద్యే తన జీవితాన్ని మార్చే శక్తి అని నమ్మి ముందుకు సాగారు. ఆయన కృషికి ఫలితంగా యూజీసీ-నెట్ (జేఆర్ఎఫ్), టీఎస్-సెట్ అర్హత సాధించారు. తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి ఎం.కాం, ఆ తరువాత ఎంబీఏ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగంలో పార్ట్‌టైమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. విజయ్‌కుమార్ తన కుటుంబంలోనే కాకుండా, గ్రామంలోనే మొదటి గ్రాడ్యుయేట్గా, మొదటి డాక్టరేట్ పట్టభద్రుడిగా నిలిచారు.

# బీజేపీలోకి భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, కాటారం :** మహాముత్తారం మండలంలోని మీనాజీపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు బీజేపీలో చేరారు. కాటారంలో తమ నివాసంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చల్ల నారాయణ రెడ్డి, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మీనాజీపేట మాజీ సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ముగ్గురు కార్యకర్తలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలన పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. చేరిన వారిలో కాంగ్రెస్ నుంచి కొంతల దేవేందర్ రెడ్డి, మంకుర్తి సమ్మయ్య; బీఆర్ఎస్ నుంచి పంతంగి రమేష్, మంకుర్తి స్వామి, రుద్రాక్ష రాయమల్లు ఉన్నారు. ఈ సందర్భంగా చల్ల నారాయణ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ 'ఆరు గ్యారంటీలు, 66 మోసపూరిత హామీలు, 420 వాగ్దానాలతో' అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. మంథని ప్రాంత మంత్రి హైదరాబాద్‌కే పరిమితం అయ్యారని ఎద్దేవా చేశారు. గ్రామ స్థాయి నుంచి బీజేపీ బలోపేతం అవుతోందని, రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాటారం మండల ఇంచార్జి పిల్లలమర్రి సంపత్, మాజీ సర్పంచ్ రాజ్, డాక్టర్ రఫీ, కాటారం మండల అధ్యక్షుడు పాగె రంజిత్ కుమార్, దుర్గం తిరుపతి, బండం మల్లారెడ్డి, శ్రీశైలం, బొంతల రవి, చీర్ల బాపురెడ్డి, లక్కు నాయక్, గోగు రాజేష్, కిషోర్, రాజేందర్ పాల్గొన్నారు.

# ఘనంగా కొండా సురేఖ పుట్టినరోజు వేడుకలు

## మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదినాన్ని పురస్కరించుకుని, వరంగల్ కొత్తవాడ 23వ డివిజన్‌లోని శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా, 23వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత మార్కండేయ స్వామికి అర్చన, అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ అధ్యక్షుడు దామెర రాజ్ కమల్, 12వ డివిజన్ అధ్యక్షుడు బాసాని కరుణాకర్, బొల్లు సతీష్, నంబి మురళి, దేవర రాము, మామిడాల నరేష్, దాసరి రాజశేఖర్, ఈగ శ్రీధర్, ఆడెపు రాహుల్, దొంతుల ఉమ పాల్గొన్నారు.

# 108 వాహనాల తనిఖీ



**వరంగల్ వాయిస్, మల్హర్:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 108 వాహనాలను డీఎంహెచ్‌వో మధుసూదన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాడిచెర్ల, మహా ముత్తారం మండలాలకు చెందిన 108 అంబులెన్సుల్లోని మెడికల్ ఎక్విప్‌మెంట్, మందులు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి సిబ్బందికి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు సత్వర సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో 108 డిస్ట్రిక్ట్ మేనేజర్ మెరుగు నరేష్ యాదవ్, రేగొండ మెడికల్ ఆఫీసర్ హిమబిందు, ఎంసీహెచ్‌వో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, 108 సిబ్బంది పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉన్న విద్యుత్ అధికారులు

## ◆ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉన్నారని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ములుగు డివిజన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సరఫరాను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఇంటర్ లింకింగ్ లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, వాటిని కన్నాయిగూడెం వరకు విస్తరించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు సిబ్బంది, సామాగ్రితో కూడిన బ్రేక్‌డౌన్ టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. కొత్తగా నిర్మిస్తున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పనులను వేగవంతం చేయాలని అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఏవైనా విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే టీజీఎన్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ మల్సూరు నాయక్, ములుగు డీఈ నాగేశ్వర రావు, డీఈ ఎంఆర్టీ సదానందం, ఏడీఈ సందీప్ పాల్గొన్నారు.


# మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, చిట్యాల:** ఇటీవల మరణించిన బుర్ర రాజయ్య గౌడ్ కుటుంబాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి పరామర్శించారు. చిట్యాల మండల కేంద్రంలోని రాజయ్య గౌడ్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాటికొండ రవి కిరణ్, మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు చెక్క నరసయ్య, రేగొండ మండల ఉపాధ్యక్షులు శివకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు నిలిచిన బొగ్గు ఉత్పత్తి

**వరంగల్ వాయిస్, మల్హర్:** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని తాడిచర్ల ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. వర్షపు నీరు మైన్‌లోకి చేరడంతో బొగ్గు ఉత్పత్తి పనులు నిలిచిపోయాయి. ఈ వర్షాల వల్ల 18 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, మూడు లక్షల మెట్రిక్ టన్నుల మట్టి వెలికితీసే (ఓబీ) పనులకు అంతరాయం కలిగిందని ఏఎంఆర్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, మేనేజర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.



# యాస్పి రేషనల్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, మల్హర్/ భూపాలపల్లి:** ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్‌లో భాగంగా పలిమెల మండలం పనితీరును సమీక్షించేందుకు సెంట్రల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమణ యాద్ల జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఆయన ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సిబ్బంది, పలిమెల నోడల్ ఆఫీసర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) మధుసూదన్ ఆరోగ్య అభివృద్ధి కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు డాక్టర్ రమణ జిల్లాలో పర్యటించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను తనిఖీ చేయనున్నారు. అలాగే, గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ప్రజలతో నేరుగా మాట్లాడనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ప్రమోద్ కుమార్, డాక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో 37 మందికి జరిమానా

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఐదుగురికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం రూ. 3,000 జరిమానా విధించారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 37 మందికి రూ. 51,300 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. సుజాత ఒక ప్రకటనలో తెలిపారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**వరంగల్ వాయిస్, మల్హర్/ మహాముత్తారం:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మంగళవారం మహా ముత్తారం మండలంలోని ముత్తారం – యామనపల్లి, కేశవాపూర్ – పెగడపల్లి గ్రామాల మధ్య ఉప్పొంగుతున్న పెద్దవాగు ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఉండాలని, పొంగుతున్న వాగులపై ప్రజలు ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తతో బారికేడింగ్ ఏర్పాటు చేసి, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు నిఘా ఉంచాలని సూచించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే, వాగుల్లో చేపలు పట్టేందుకు ఎవరూ వెళ్లవద్దని ఆయన హెచ్చరించారు. రహదారిపై నీరు పారుతున్నందున ప్రజల ప్రయాణాలపై పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ అధికారులను అడిగి



తెలుసుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గంగా అజాం నగర్ మీదుగా ప్రయాణిస్తున్నారని, ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, పీఆర్ డీఈ రవీందర్, ఎంఈఓ రవీందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily


GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, ఆగస్టు 19, 2025

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

◆ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**వరంగల్ వాయిస్, డోర్నకల్:** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మంగళవారం డోర్నకల్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఫర్టిలైజర్ షాప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ క్లాసుల ద్వారా విద్యా బోధన చేయాలని, ప్రతి సబ్జెక్టును పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలన్నారు. అలాగే, పాఠశాల పరిసరాలు, డైనింగ్ హాల్, వంటగది, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, నిత్యం శానిటేషన్ నిర్వహించాలని ఆదేశించారు. ఆహారం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా





విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. జిల్లాలో యూరియా కృత్రిమ కొరత సృష్టించవద్దని, అధిక ధరలకు అమ్మకూడదని కలెక్టర్ హెచ్చరించారు. రైతుల కోసం దుకాణాలను అందుబాటు సమయాల్లో తెరిచి ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అమ్మకాలు జరపాలని సూచించారు. ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే రైతుల పాసుబుక్, ఆధార్ కార్డు వివరాలు తీసుకొని అమ్మకాలు చేయాలని స్పష్టం చేశారు. దుకాణాల్లోని ఆన్‌లైన్ ఓపీఎంఎస్, ఫిజికల్ గోడౌన్ నిల్వలు కచ్చితంగా సరిపోలాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో వర్షాలు, వరదల కారణంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసి, యూరియా నిల్వలను సరిచూసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, డోర్నకల్ తహసీల్దార్ ఇమ్మానియేల్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం:** మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి, బుద్ధారం గ్రామాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించి మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మొగిలి కోమల ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోమల అంతిమయాత్రలో పాల్గొని ఆమె భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బుద్ధారం గ్రామానికి వెళ్లి ఇటీవల మరణించిన పెరుమాండ్ల మొగిలి, బండి శాంతమ్మల కుటుంబ సభ్యులను వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# వనం శరత్ బాబుకు రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి ప్రదానం



**వరంగల్ వాయిస్,వరంగల్:** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐఅండ్ పీఆర్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో వరంగల్ జిల్లా శంభునిపేటకు చెందిన వనం శరత్ బాబు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గ్రీన్ పార్క్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా శరత్ బాబు రూ. 20 వేల నగదు పురస్కారంతో పాటు బహుమతిని అందుకున్నారు. ఇందిరమ్మ ఇల్లు పథకానికి సంబంధించి ఆయన తీసిన ఫొటోకు ఈ ప్రథమ బహుమతి లభించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక హాజరయ్యారు. శరత్ బాబుకు ప్రథమ బహుమతి లభించడం పట్ల 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, డాక్టర్ పోతు మహేష్, నాయిని అశోక్, పోతు రమేశ్ బాబు, ఎలుగు ఉపేందర్, బజ్జూరి ప్రభాకర్, వరంగల్ జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షుడు బొలిశెట్టి కమలాకర్, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహ రాములు, దోమ శ్రీధర్, కోల రాము, జక్కం దామోదర్, ఎలుగు రవికుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

# లయన్స్ సేవలు విస్తరించాలి

■ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి 19వ ప్రమాణ స్వీకార కార్యక్రమం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగింది. లయన్ ఇనుముల కృపాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ దీవి అజిత్ కుమార్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ.. లయన్స్ సేవలను విస్తృతం చేసి, ఎక్కువ మంది సభ్యులను చేర్చుకోవడం ద్వారా మరింత మందికి సహాయం చేయవచ్చన్నారు. అలాగే, లయన్స్ పర్మినెంట్ ప్రాజెక్టుల ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు, మందులు పంపిణీ చేస్తున్నామని, ఈ ఏడాది పాఠశాల విద్యార్థులకు ఉచిత బ్యాగులు, నోట్‌బుక్స్ అందించామని తెలిపారు. మాజీ జిల్లా గవర్నర్ లయన్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య ప్రతి పాఠశాలకు చేరాలని అన్నారు. అనంతరం, మొదటి ఉపజిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి మిషన్ 1.5 గురించి వివరిస్తూ, నూతన సభ్యులను క్లబ్‌లోకి ఆహ్వానించి సేవలను విస్తృతం చేయాలని



సూచించారు. అనంతరం రెండవ ఉపజిల్లా గవర్నర్ లయన్ పుట్ట హరికిషన్ రెడ్డి నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో క్లబ్ అధ్యక్షుడిగా ఆరేపల్లి శాంతి కిరణ్, కార్యదర్శిగా శ్యాంసుందర్, కోశాధికారిగా మోర రవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రకాశం, జిల్లా కోశాధికారి చల్ల రఘునాథరెడ్డి, జిల్లా చీఫ్ సెక్రటరీ మార్గం ప్రభాకర్, జిల్లా పీఆర్‌వో కళ్యాణపు రాజమౌళి, క్లబ్ సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# మేరుగు ప్రతాప్ కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు ప్రదానం



**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌కు చెందిన నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్ మేరుగు ప్రతాప్ వరుసగా ఐదోసారి రాష్ట్రస్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని గ్రీన్‌ల్యాండ్స్ హోటల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఆయనకు ఈ అవార్డును అందజేశారు. ప్రభుత్వ పథకాలైన ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, చేయూత పింఛన్లకు సంబంధించి ప్రతాప్ తీసిన ఫొటోలను ప్రభుత్వం ఉత్తమ ఫొటోలుగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయనకు నగదు బహుమతితో పాటు ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా అవార్డు అందుకున్న మేరుగు ప్రతాప్‌ను పలువురు జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

# దామెరలో ఘనంగా కృత్యమేళా



**వరంగల్ వాయిస్, దామెర:** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల కోసం మండల కేంద్రంలో 'కృత్యమేళా' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు బోధించే పాఠాలను మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా చేయడానికి ఉపాధ్యాయులు రూపొందించిన కొత్త బోధనా పద్ధతులను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. మండలంలో ఉన్న 14 ప్రాథమిక పాఠశాలల నుంచి మొత్తం 42 కృత్యాలు ప్రదర్శనకు రాగా, వాటిలో 10 ఉత్తమ కృత్యాలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మండల విద్యాశాఖ అధికారి లాకావత్ రాజేష్ కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, ఎఫ్ఎల్ఎన్ ఆర్‌పిలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా ఊరుగొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్, శ్యాంసుందర్, మహేందర్ వ్యవహరించారు.

# నూతన ఎస్సై రాజేష్ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, రేగొండ:** రేగొండ మండల నూతన ఎస్సైగా కే. రాజేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆయన రామగుండం కమిషనరేట్ పరిధిలో టాస్క్ ఫోర్స్ ఎస్సైగా పనిచేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై సందీప్ కుమార్ బదిలీపై భూపాలపల్లికి వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై రాజేష్ మాట్లాడుతూ.. మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించి, మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కృషి చేస్తానని చెప్పారు.

# రేణుక ఎల్లమ్మకు చీరల అలంకరణ



**వరంగల్ వాయిస్, జనగామ:** పట్టణంలోని బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా అమ్మవారికి 61 రకాల చీరలతో విశేష అలంకరణ చేశారు. శ్రావణమాసంలో ప్రతి మంగళవారం అమ్మవారిని విభిన్న రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనమివ్వడం ఆలయ ఆచారం. ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రత్యేక అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. దీపకాంతుల మధ్య ప్రకాశిస్తున్న అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మంగళహారతులు సమర్పించారు.


# ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలి

## ◆ 24న బహిరంగ సభ ను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్:** మధ్య భారతంలో అమలవుతున్న 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 24న హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఖిలా వరంగల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ.. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ సభకు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ సభలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు జె.వి. చలపతిరావు, ప్రొఫెసర్ హరగోపాల్, డి.నరసింహారెడ్డి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు తదితరులు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా నాయకుడు ఆరెల్లి రవి, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకుడు చిర్ర సూరి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జక్కి శ్రీకాంత్, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ తదితరులు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని, 1996 పీసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు, ఆదివాసీలపై జరుగుతున్న హింసను నిలిపివేయాలని, బస్తర్‌లో ఏర్పాటు చేసిన సాయుధ పోలీసు శిబిరాలను ఎత్తివేయాలని కోరారు. అలాగే, కేంద్రం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకుడు జన్ను నరసయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు వీరెల్లి శ్రీనివాస్, ప్రజా పార్టీ రాష్ట్ర నాయకులు రాజన్ బాబు, మల్లెపాక చంద్రమౌళి, గడ్డం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, తిరుపతి:** తెలంగాణ మంత్రి కొండా సురేఖ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నానని ఆమె తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచి పనులకు మరింత తోడ్పాటు, దీవెనలు అందించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు పేదలందరికీ అందేలా ఆశీర్వదించాలని కోరినట్లు తెలిపారు.

### శబరిమలలో అభిమాని ప్రత్యేక పూజలు..

తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా, ఆమె ప్రియ శిష్యుడు,





కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ మడిపల్లి కృష్ణ గౌడ్ కేరళలోని శబరిమల శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ఆరోగ్య, ఆయురారోగ్యాలు, సుసంపన్నం కోసం ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, హోమములు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు మడిపల్లి కృష్ణ గౌడ్ తెలిపారు. ప్రజల కోసం మంత్రి మరింత కృషి చేసి, తెలంగాణ అభివృద్ధిలో సేవలందించేందుకు స్వామివారి కృప లభించాలని తన మిత్రులతో కలిసి ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు.

### ఘనంగా మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు..

**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ ఘనంగా నిర్వహించింది. కాంగ్రెస్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ కన్వీనర్ కొక్కొండ రమేష్, రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు నిమ్మని శేఖర్ రావు, ముదసిర్ అహ్మద్ కయ్యుం, దయాన్ శ్రీనివాసన్, కె.అంబరీష్ రావు, వెంకట రమణ, న్యాయవాదులు మహేందర్, కృష్ణ, రఘుపతి, రమేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గోవులను రోడ్లపై విడిచి పెడితే సహించేది లేదు

## మున్సిపల్ కమిషనర్ సుష్మ



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలో రోడ్లపై పశువులు విచ్చలవిడిగా తిరుగుతూ ట్రాఫిక్ సమస్యలకు, ప్రమాదాలకు కారణమవుతున్నాయని మున్సిపల్ కమిషనర్ కొడారి సుష్మ హెచ్చరించారు. పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపై వదిలేస్తే వాటిని గోశాలకు తరలించాల్సి వస్తుందని ఆమె స్పష్టం చేశారు. పశువుల వల్ల వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 18న రోడ్లపై తిరుగుతున్న కొన్ని పశువులను మున్సిపల్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారని, ఇప్పటివరకు వాటి యజమానులు ఎవరూ స్పందించలేదని అన్నారు. అదుపులో ఉన్న పశువుల యజమానులు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి, తగిన జరిమానా చెల్లించి, భవిష్యత్తులో వాటిని రోడ్లపై వదలిపెట్టబోమని పూచీకత్తు ఇచ్చి పశువులను తీసుకెళ్లాలని సూచించారు. లేకపోతే, ఈ నెల 22 తర్వాత ఆ పశువులను గోశాలలకు తరలిస్తామని హెచ్చరించారు. పశువుల వల్ల జరిగే ప్రమాదాలకు యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

# బాలల సంఘాల బలోపేతం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మహాత్మా జ్యోతి బా పూ లే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలోని బాలల సంఘాలను బలోపేతం చేసే కార్యక్రమాన్ని 'మా సోషల్ సర్వీస్ సొసైటీ' ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద పాఠశాలకు అవసరమైన మెటీరియల్‌తో పాటు మైక్ సెట్, స్టాండ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నాగబండి శివప్రసాద్ మాట్లాడుతూ.. బాలల సంఘాల ద్వారా విద్యార్థులలో అవగాహన పెంచడం, పాఠశాలలోని సమస్యలను పరిష్కరించడం, స్వీయసేవ, స్వావలంబన, మంచి నడవడిక, బాలల హక్కుల పరిరక్షణ వంటి విషయాలపై వారికి శిక్షణ ఇస్తామని తెలిపారు. బాలల సంఘాలలో ఆటలు, సాంస్కృతిక కమిటీ, గ్రంథాలయ కమిటీ, భోజన కమిటీ, గోడపత్రిక కమిటీ, పచ్చదనం, పరిశుభ్రత కమిటీ, క్రమశిక్షణ కమిటీ, సమాచార కమిటీ, తరగతి లీడర్ల కమిటీ వంటివి ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమానికి డెల్ టెక్నాలజీస్‌కు చెందిన వజినపల్లి సునీల్ కుమార్ సహకరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, సొసైటీ కార్యదర్శి నాగబండి శివప్రసాద్, వాలంటీర్ మమత, చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన ఝాన్సీ రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి మంగళవారం తొర్రూరు పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త రేవూరి వెంకన్న కుమారుడు తన్మయ్, దామెర సురేష్ కుమార్తె శ్రావ్య వివాహం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి వారి నివాసానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాల పరామర్శ..

పట్టణంలోని 16వ వార్డుకు చెందిన గుర్రాల మధుకర్ రెడ్డి కుమారుడు సాయి నవనీత్ రెడ్డి ఇటీవల మరణించడంతో ఝాన్సీ రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, 2వ వార్డుకు చెందిన సీతమ్మ ఇటీవల మరణించగా, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో ఆమె వెంట పట్టణ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు ఉన్నారు.

# రమేష్‌కు పీహెచ్‌డీ పట్టా ప్రదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవం సందర్భంగా వేముల రమేష్‌కు పీహెచ్‌డీ పట్టా ప్రదానం జరిగింది. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్య అతిథి, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చేతుల మీదుగా రమేష్ ఈ పట్టాను అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేముల రమేష్ మాట్లాడుతూ పీహెచ్‌డీ పూర్తి చేయడానికి సహకరించిన తన గైడ్ డాక్టర్ జి.శ్రీనివాస్ రావుకి, అలాగే మద్దతుగా నిలిచిన తన కుటుంబ సభ్యులు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. వేముల రమేష్ టీపీసీసీ లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



**వరంగల్ వాయిస్, నడికూడ:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నడికూడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జి.విమల అన్నారు. మంగళవారం రాయపర్తి గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన అనంతరం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులు పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా చూసుకొని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో విద్యావతి, రాయపర్తి గ్రామ కార్యదర్శి బి.స్రవంతి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఏఐ ఆధారిత హనుమాన్ మూవీ

## భారీ ఎత్తున నిర్మించేందుకు సన్నాహాలు

ఇప్పుడంతా పురాణాల కాలం నడుస్తోంది. పురాణాల ఆధారంగా చిత్రాలకు ఆదరణ పెరుగుతోంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం బాగా పెరుగుతోంది. –టెక్నాలజీ రంగం నుంచి హెల్త్, ఎడ్యుకేషన్, బిజినెస్, ఎంటర్‌టెయిన్‌మెంట్ తో పాటు–.. ముఖ్యంగా సినిమా పరిశ్రమలో ఏఐకి డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోంది. కథలు రాయడం నుంచి విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ సన్నివేశాల వరకు ఏఐ ద్వారా సులభతరం అవుతుంది. ఇప్పటికే కొన్ని షార్ట్ ఫిల్మ్స్, యానిమేటెడ్ క్లిప్స్ మాత్రమే ప్రేక్షకుల ముందుకు రాగా, ఇప్పుడు బాలీవుడ్ నుంచి ఒక భారీ పూర్తి స్థాయి ఏఐ సినిమా రాబోతోందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం 'చిరంజీవి హనుమాన్'. పురాణాల్లో అత్యంత శక్తివంతమైన దేవుడిగా, భక్తుడిగా పేరుగాంచిన హనుమంతుని శౌర్యం, భక్తి, అద్భుత గాథను ఏఐ ఆధారిత యానిమేషన్ శైలిలో చూపించబోతున్నారు. ఇది సాధారణ మిథాలజీ సినిమా కాదు, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన స్పెషల్ ప్రాజెక్ట్. హనుమంతుని ధైర్యం, భక్తి, సాహసాలను ఇప్పటివరకు స్క్రీన్‌పై చూడని విధంగా చూపించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ని ప్రారంభించారట. ఈ ప్రాజెక్ట్‌ని బాలీవుడ్ ప్రముఖ నిర్మాతలు విక్రమ్ మల్హోత్రా, విజయ్ సుబ్రహ్మణ్యం సంయుక్తంగా నిర్మిస్తుండగా, విజువల్స్, గ్రాఫిక్స్, యాక్షన్ సన్నివేశాలను.. అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్లతో కలసి, ఏఐ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి, హనుమంతుని వ్యక్తిత్వాన్ని కొత్త కోణంలో చూపించబోతున్నారని టీమ్ వెల్లడిరచింది. ఇందులో భాగంగా ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. అంతే కాదు ఈ చిత్రం వచ్చే ఏడాది హనుమాన్ జయంతి సందర్భంగా థియేటర్స్‌లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# థగ్ లైఫ్ ఫలితం.. నాన్నను దెబ్బతీయదు

## నటి శృతి హాసన్ కామెంట్స్

అగ్ర హీరోల సినిమాల్లో నటిస్తూ శ్రుతిహాసన్ హిట్‌లను సొంతం చేసుకుంటున్నారు. తాజాగా 'కూలీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించి ఆకట్టుకున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం విజయాన్ని అందుకుంది. ఈసందర్భంగా హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రుతి తన తండ్రి కమల్‌హాసన్ గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రభావం తనపై ఎంతో ఉందన్నారు. నేను కమల్ హాసన్ కుమార్తెగా పరిచయమయ్యాను. కాబట్టి నాపై ఆయన ప్రభావం చాలా ఉంటుంది. నా నటనను ఆయన యాక్టింగ్‌తో పోలుస్తుంటారు. కానీ దానివల్ల నేనెప్పుడూ ఇబ్బంది పడలేదు. ఆయన ఎప్పుడూ నావెంట ఉండడం నా అదృష్టంగా భావిస్తాను. ఇండస్ట్రీలోని ఎంతోమందిలో ఆయన స్ఫూర్తి నింపారు. నాన్న నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. ఎంత ఎదిగినా ఒదిగిఉండాలని ఆయన దగ్గర నుంచే నేర్చుకున్నాను' అని తెలిపారు. ఇక కమల్ హాసన్ నటించిన 'థగ్‌లైఫ్' మిశ్రమ ఫలితాలను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై శ్రుతిహాసన్ మాట్లాడుతూ.. బాక్సాఫీస్ నంబర్లు కమల్‌హాసన్‌ను ప్రభావితం చేయలేవని తెలిపారు. 'పదేళ్ల క్రితం ఇండస్ట్రీలో ఈ నంబర్ల ప్రస్తావన ఉండేది కాదు. మా నాన్న తన సొంత డబ్బు పెట్టి సినిమా తీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆయనది నంబర్ల గురించి ఆలోచించే మనస్తత్వం కాదు. వాటి గురించి పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటారు' అని శ్రుతి హాసన్ వివరించారు.





# కమల్, రజనీలతో లోకేశ్ మల్టీస్టార్టర్ మూవీ

కూలీ సినిమాతో సూపర్ హిట్‌ని అందుకున్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు– తెలుస్తుంది. ఇప్పటికే నటుడు కార్తీతో ఖైదీ 2 సినిమాను లైన్‌లో పెట్టిన లోకేష్.. ఈ సినిమా కంటే ముందే మరో బిగ్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించబోతున్నాడని సమాచారం. సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్‌లతో కలిసి కలిసి లోకేష్ ఒక భారీ మల్టీస్టారర్ చేయబోతున్నట్లు– కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇద్దరు వయసు మళ్లిన గ్యాంగ్‌స్టర్ల కథ అని తెలుస్తుంది. ఇద్దరు లెజెండరీ నటుల ఇమేజ్‌కు తగ్గట్టుగా లోకేష్ కనగరాజ్ ఈ కథను సిద్ధం చేశాడని.. ఈ కథకు ఇద్దరు హీరోలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రాన్ని కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ అయిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మించనుందని సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రకటన రాబోతుంది.




# కాంతారా నుంచి కులశేఖర పాత్ర పరిచయం

కన్నడ నటుడు రిషభ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజాచిత్రం 'కాంతార చాప్టర్ –1బ్లాక్ బస్టర్ మూవీ'కాంతార' సినిమాకు ప్రీక్వెల్ గా ఈ సినిమా రాబోతుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ప్రమోషన్స్ షురూ చేశారు మేకర్స్. ఇందులో భాగంగా ఇప్పటికే కథానాయిక రుక్మిణి వసంత్‌ని పరిచయం చేసిన చిత్రయూనిట్ తాజాగా మరో కీలక పాత్రను పరిచయం చేసింది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కులశేఖర పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించారు. ఈ పోస్టర్ చూస్తుంటే గుల్షన్ ఇందులో విలన్‌గా కనిపించబోతున్నట్లు– తెలుస్తుంది. ఒబాలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. అజ్నీశ్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని కన్నడతో పాటు– తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల చేయనున్నారు.



# సందేశ సినిమాల్లో నారాయణమూర్తిదే పైచేయి

## నటుడు బ్రహ్మానందం కితాబు

ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యూనివర్సిటీ–పేపర్ లీక్'. ఇది ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో టీమ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి బ్రహ్మానందం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్.నారాయణమూర్తితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈరోజు మన దేశ విద్యావ్యవస్థ మారిపోయింది. నాకు ఆయన 40 సంవత్సరాలుగా తెలుసు. నిరంతరం ప్రజల గురించే ఆలోచిస్తారు. చివరిశ్వాస వరకూ మీకోసం కష్టపడుతూనే ఉండాలని కోరుకుంటున్నాను. ఇది ఎంతో అందమైన సినిమా. ఇందులో నిజాలుంటాయి.. బూతులు ఉండవు, జీవితపు లోతులుంటాయి. 'పెద్ద వాళ్లకు కావాలంటే నాలో అమ్మడానికి చాలా ఉన్నాయి.. కిడ్నీ కూడా ఉంది' అంటూ సాగే కొన్ని డైలాగులు వింటే హృదయం కదిలిపోయింది. ఈ సినిమాను అందరూ చూడాలి. అర్థం చేసుకోవాలి. సమాజం బరువు మోసే వ్యక్తి నారాయణమూర్తి. ఆయన ఒక శక్తి అన్నారు. నారాయణమూర్తి చేసినన్ని మంచి పనులు నేను చేయలేదు. చేస్తానో, లేదో కూడా తెలియదు. నారాయణమూర్తి మాట్లాడుతూ.. 'తెలుగు చిత్ర పరిశ్రమలో బ్రహ్మానందం మహానటుడు, మహా జ్ఞాని. అన్నిటికీ మించి మాస్టారు. అందుకే ఈ సినిమాను ఆయనకు చూపించాను. ఆయన వెంటనే నా విజ్ఞప్తిని మన్నించి 'యూనివర్సిటీ'ని చూశారు. నన్ను ఆశీర్వదించారు. ఆయన స్పీచ్ వింటుంటే నాకు ఆనందబాష్పాలు ఆగలేదు' అంటూ భావోద్వేగానికి గురయ్యారు.



# సంక్షేమమే సేవ.. సైన్సే లక్ష్యం

- **అట్టహాసంగా తెలంగాణ సైన్సు కాంగ్రెస్ ప్రారంభం**
- **కేయూలో మూడు రోజుల పాటు నిర్వహణ**

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ సెనేట్ హాల్ లో మంగళవారం అంగరంగ వైభవంగా తెలంగాణ సైన్సు కాంగ్రెస్–2025ప్రారంభమైంది. ఆగష్టు 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు కాకతీయ విశ్వవిద్యాలయ గోల్డెన్ జూబిలీ ఉత్సవాలకు గుర్తుగా కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ అకాడమీ అఫ్ సైన్సెస్ సంయుక్త నిర్వహణలో వీటిని ప్రారంభించినట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్, తెలంగాణ సైన్సు కాంగ్రెస్–2025 చైర్మన్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి వెల్లడించారు. 'సంక్షేమమే సేవ' సైన్సు లక్ష్యం కావాలి అన్నారు. యువత ఆ దీశగా అడుగువేయాలని తన అధ్యక్ష ఉపన్యాసంలో తెలిపారు. క్వాంటం ఫిజిక్స్, ఎన్విరాన్మెంట్, ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ నూతన శాస్త్ర, సాంకేతిక రంగాలలో అడుగిడుతున్నాం, వికసిత్ భారత్ 2047 దిశగా, తెలంగాణ రైజింగ్ దీశగా కదులుతున్నాం అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, ఇండస్ట్రీ కలయిక అవసరం అని వివరించారు. గౌరవ అతిథులుగా హాజరైన తెలంగాణ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆచార్య బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ యువత నైపుణ్యం ద్వారా సాధికరత సాధిస్తారన్నారు. భారతీయ యువత విద్య, వైజ్ఞానిక రంగాల్లో ప్రపంచానికి పోటీ ఇస్తున్నారన్నారు. తెలంగాణ అకాడమీ అఫ్ సైన్సు అధ్యక్షులు ఆచార్య సీహెచ్. మోహనరావు మాట్లాడుతూ సామజిక పరివర్తనకు సైన్సు ఒక సాధనం అన్నారు. భారతదేశం సైన్సుకు కట్టుబడి ఉంది అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్డీఓ పూర్వపు చైర్మన్, భారత ప్రభుత్వ మినిస్ట్రీ అఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి మాట్లాడుతూ 'ఇన్నోవేటివ్ స్కిల్స్ ఫర్ ఎంపవర్మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్ఫార్మింగ్ యంగ్ ఇండియా' థీమ్ తో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు, యువత ఆవిష్కరణలు భారత్ దేశానికి ఆదర్శం అని వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడుతూ మూడు రోజులు తెలంగాణ సైన్సు కాంగ్రెస్ కు అన్ని ఏర్పాట్లు చేసినట్టు, సహకరించిన సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సైన్సు కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య బి.వెంకట్రామ రెడ్డి మాట్లడుతూ ఇన్నోవేటివ్ స్కిల్స్ అండ్ ఎంపవర్మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్ఫర్మేషన్ యంగ్ ఇండియాపై నిర్వహించటం, దానికి తగ్గట్టుగా విశ్వవిద్యాలయంలో ఏర్పాట్లు చేసినట్టు, వివిధ సెమినార్ హాల్ లలో దీమటిక్ సెషన్, ప్లీనరీ సెషన్ లు, పాటశాల విద్యార్థులతో శాస్త్రవేత్తల ముఖాముఖీ, పాఠశాల సైన్సు టీచర్ లతో సమావేశం, ఎగ్జిబిషన్ లు నిర్వహిస్తాం అన్నారు. తెలంగాణ అకాడమీ అఫ్ సైన్సెస్ జనరల్ సెక్రటరీ ఆచార్య ఎస్.సత్యనారాయణ, ట్రెజరర్ ఆచార్య ఎస్ఎం.రెడ్డి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్తాఫ్ హుస్సేన్ తో పాటు తెలంగాణ అకాడమి అఫ్ సైన్సు ఫెలోలు, పాలకమండలి సభ్యులు, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. అతిథులచే తెలంగాణ సైన్సు కాంగ్రెస్ అబ్ స్ట్రాక్ట్ ను విడుదల చేశారు. అదే విధంగా తెలంగాణ అకాడమీ అఫ్ సైన్సు సహకారంతో అల్ ఇండియా రేడియో విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ 'భారతదేశంలో తోలి వనితా వైద్యులు' పుస్తకాన్ని, కాకతీయ విశ్వవిద్యాలయ జియాలజి విభాగ పూర్వపు విద్యార్థి ఎజిఎస్. రెడ్డి రచించిన 'ది రీసెర్చర్స్ కంపాస్'పుస్తకాన్ని ఆవిష్కరించారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో మూడు రోజుల (ఆగష్టు 19 – 21) తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సందర్భంగా నిర్వహించిన 'సెరికల్చర్ విభాగ కౌంటర్' ఆకర్షణగా నిలిచింది. డాక్టర్ కె.సుజాత విభాగ విశిష్టతలను వివరిస్తూ, ముల్బెర్రీ మరియు నాన్ ముల్బెర్రీ గూడిపట్టుచీలుకలపై బోధన, పెంపకం మరియు పరిశోధన నిర్వహించేది కాకతీయ యూనివర్సిటీ మాత్రమే అని వెల్లడించారు. పట్టు ఉత్పత్తులు, పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటల ప్రాముఖ్యతను విశదీకరించారు. ఈ రంగంలో పెరుగుతున్న అవకాశాలు, ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, అలాగే గృహ అవసరాలకు సంబంధించి ఉన్న అవకాశాలపై కూడా స్పష్టమైన వివరాలు అందించారు.

# రక్షణ రంగంపై అవగాహన పెంచాలి

- **వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ముందుకు సాగాలి**
- **ఎల్ఆర్డిఈ డైరెక్టర్ జి.విశ్వం**

**వరంగల్ వాయిస్, కేయూ :** రక్షణ రంగంపై అవగాహన పెంచాలని, పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచడానికి కృషి చేయాలని డీఆర్డీఓ బెంగళూరు, ఎల్ఆర్డిఈ డైరెక్టర్ జి.విశ్వం సూచించారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ లో భాగంగా మంగళవారం 'ఆర్ అండ్ డి డిఫెన్స్ టెక్నాలజీస్, అపార్టునిటీస్ అండ్ ఛాలెంజెస్–ఏ 2047 పర్స్పెక్టివ్స్' అనే అంశంపై విశ్వం ప్రధాన ప్రసంగం చేశారు. దేశ అభివృద్ధిలో రక్షణ సాంకేతికతల పాత్ర ఎంతో కీలకమన్నారు. రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధిపై ప్రభుత్వ పెట్టుబడులు, శాస్త్ర సాంకేతిక పురోగతి ఆధునిక రక్షణ అవసరాలను తీర్చడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని వివరించారు. భారతదేశంలో రక్షణ పరిశోధనలో డీఆర్డీఓ ఒకే ముఖ్యమైన ప్రభుత్వ సంస్థగా ఎన్నో దశాబ్దాలుగా పనిచేస్తూ, అకడమియా, పరిశ్రమలు, పరిశోధనా సంస్థల మధ్య అనుసంధానాన్ని పెంపొందించిందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని హైపర్సోనిక్ మిసైళ్లు, బ్యాలిస్టిక్, క్రూయిజ్ మిసైళ్లు, స్పేస్ మానిటరింగ్ సిస్టమ్స్, డ్రోన్లు, యాంటీ డ్రోన్ టెక్నాలజీలు, క్వాంటమ్ టెక్నాలజీలు, లేజర్ ఆధారిత ఆయుధాలు, ఏఐ, డీప్ లెర్నింగ్ వంటి అనేక ఆధునిక రక్షణ సాంకేతికతలు అభివృద్ధి చేయడం అత్యవసరమని ఆయన తెలిపారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా మౌలిక వసతులు, సిమ్యులేషన్ ఫెసిలిటీలను విస్తృతంగా అభివృద్ధి చేయాలని, అకడెమిక్ ఇనిస్టిట్యూట్స్‌లో ప్రత్యేక కోర్సులు ప్రారంభించి రక్షణ రంగంపై అవగాహన పెంచాలని, పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచడానికి పెద్ద స్థాయిలో కృషి చేయాలని జి.విశ్వం సూచించారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని సాధించాలంటే



స్టార్ట్–అప్ మిషన్‌ను మరింత ఉత్సాహంగా ముందుకు నడపడం అవసరమన్నారు. తన 30 ఏళ్ల అనుభవాన్ని ఆధారంగా చేసుకొని డీఆర్డీఓలో రాడార్ సిస్టమ్స్, డిఫెన్స్ డిజైన్, ఆపరేషనలైజేషన్‌లో చేసిన కృషిని వివరించిన ఆయన, రాబోయే దశాబ్దాల్లో దేశ రక్షణ రంగం ఎదుర్కొనే అవకాశాలు, సవాళ్లను గుర్తించి ముందుగానే సిద్ధం కావడం ఎంతో కీలకమని స్పష్టం చేశారు. అనంతరం జి.విశ్వంను కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి ఘనంగా సన్మానించారు.

# 1,000 కోట్లతో చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- **వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి కేరళ ప్రభుత్వం తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక పథకాలు, రాయితీలు ప్రకటించాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు డిమాండ్ చేశారు. హనుమకొండ అడ్వొకేట్స్ కాలనీలోని ఆయన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించడానికి కేరళ రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోందన్నారు. అందులో భాగంగా గ్లోబల్ మార్కెట్ యాక్సెసుబిలిటీ, జీఎస్టీ మినహాయింపు, ఇతర రాయితీలు కల్పిస్తున్నదని వన్నాల తెలిపారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం చేనేత హస్తకళల కళాకారులకు ఆర్థిక సహాయ పథకం (ఆశా), ఎంట్రప్రెన్యూర్ సపోర్ట్ స్కీమ్ (ఈఎస్ఎస్) వంటి పథకాలను ఎంఎస్ఎంఈలకు వర్తింపజేస్తున్నదని వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిజానికి చేనేత వస్త్రాలు, రెడీమేడ్ బట్టలుపై రూ.40 లక్షల టర్నోవర్ వరకు జీఎస్టీ విధించడం లేదని వన్నాల స్పష్టం చేశారు. కేవలం చేనేత సంఘాల నూలుపైన 5 శాతం జీఎస్టీలో 2 1/2 (సగం) శాతం కేంద్రమే రీయింబర్స్ మెంట్ ఇస్తున్నదని, మిగతా (సగం) 2 1/2 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందని వన్నాల సూచించారు. చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేనేత కార్మికులను తప్పుదోవ పట్టించడానికి కేంద్ర ప్రభుత్వానికి తూతూమంత్రంగా లేఖ రాయడం రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవడమేనని భావించాల్సి వస్తుందన్నారు. వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. చేనేత కార్పోరేషన్ ద్వారా రంగులు, రసాయనాలు, సిల్కు నూలు సబ్సిడీపై సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన బట్టలను చేనేత కార్మికులు ఉత్పత్తి చేసినవి మాత్రమే టెస్కో ద్వారా కొనుగోలు చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. తద్వారా ఆకలి చావులు, ఆత్మహత్యలు నివారించవచ్చన్నారు. క్యాష్ క్రెడిట్ రెండింతలు పెంచాలని ఆయన కోరారు. చేనేత సహకార సంఘాలకు గత ప్రభుత్వం పదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం అదే విధానాన్ని కొనసాగిస్తోందని వన్నాల విమర్శించారు. ఇప్పటికైనా చేనేత సహకార సంఘాల వెంటనే ఎన్నికలు నిర్వహించాలని,లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వన్నాల హెచ్చరించారు. చేనేత రంగాన్ని కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వన్నాల కోరారు.



# ఒక్క ఫొటో వెయ్యి భావాలకు సమానం

- **జర్నలిస్టుల సంక్షేమానికి కృషి**
- **బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
- **ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బషీర్ బాగ్ లోని టీయూడబ్ల్యూజే కార్యాలయ ఆడిటోరియంలో, తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఫోటో ప్రదర్శనను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ కాలాన్ని బంధించి మధుర స్మృతులను అందించే శక్తి ఒక్క ఫొటో గ్రాఫర్లకే ఉంటుందన్నారు. వారిని ప్రోత్సహించే దిశగా ప్రతీ సంవత్సరం వరల్డ్ ఫొటోగ్రఫీడేను అధికారికంగా నిర్వహించి, ఫొటో కాంపిటిషన్లలో విజేతలను నగదు బహుమతులు, మెమెంటోలను ప్రదానం చేస్తున్నామని వెల్లడించారు. మాయని జ్ఞాపకాల, తీయని కల ఫొటోగ్రఫీ అని పేర్కొంటూ, ఎన్నో దశాబ్దాలు గడిచినా ఒక్క ఫొటో గత స్మృతుల్ని తెలియ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి హరి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రాజేష్, అనిల్ తదితరులతో పాటు పలువురు సీనియర్ ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com